క్లుప్తంగా

రామలింగారెడ్డి సేవలు ప్రశంసనీయం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి

ధర్మవరం: తాడిమర్రి మండలం కునుకుంట్ల గ్రామంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేసిన వడ్డి రామలింగారెడ్డి సేవలు ప్రశంసనీయమని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన వడ్డి రామలింగారెడ్డి పదవీ విరమణ కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే ఆయనను దుశ్శాలువాతో సత్కరించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి రిటైర్మెంట్ సహజమని రామలింగారెడ్డి తన శేషజీవితాన్ని కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తాడిమర్రి ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

బత్తలపల్లి: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ శివశంకర్ నాయక్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారన్నారు. అదేవిధంగా మండలస్థాయిలో జరిగే కార్యక్రమానికి మండలస్థాయి అధికారులందరూ హాజరు కావాలని సూచించారు. ప్రజలు కూడా ఏవైనా సమస్యలుంటే వినతి పత్రాలను అందజేయవచ్చన్నారు.

మృతుడి కుటుంబానికి దుద్దుకుంట పరామర్శ



ప్రభాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం తరుగువాండ్లపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ప్రభాకర్‌రెడ్డి కుమారుడు జయప్రకాష్‌రెడ్డి అప్పుల బాధతో గత వారం ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆదివారం గ్రామంలోని ప్రభాకర్‌రెడ్డి ఇంటికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని సూచించారు. జయప్రకాష్‌రెడ్డి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. చేతికొచ్చిన కుమారుడు మృతిని జీర్ణించుకోలేని విషయమే అయినప్పటికీ మనో నిబ్బరంగా ఉండి కుమార్తె భవిష్యత్తుపై దృష్టి సారించాలని శ్రీధర్‌రెడ్డి ప్రభాకర్‌రెడ్డికి సూచించారు.

భోజన వసతి గృహం ఏర్పాటు



వసతి గృహాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

కదిరి అర్బన్: యర్రదొడ్డి గంగమ్మ ఆలయం వద్ద ఆదివారం దేవస్థాన భోజన వసతి గృహాన్ని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రారంభించారు. భక్తుల సౌకర్యార్థం తన సొంత నిధులతో ఈ వసతి గృహం నిర్మించినట్లు సంగీతా టెక్స్ టైల్స్ నిర్వాహకుడు మధు తెలిపారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



మాల్యవంతంలో ప్రచారం చేస్తున్న త్రైత సిద్ధాంత సేవా సమితి సభ్యులు

బత్తలపల్లి: ఆచార్య ప్రబోధానంద రచించిన త్రైత సిద్ధాంత గ్రంథాలపై ఆదివారం మాల్యవంతంలో త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక తాడిపత్రి కమిటీ అధ్యక్షుడు బాలయ్య ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవాత్మ, ఆత్మ, పరమాత్మను తెలుసుకోవడంతో మధ్యాత్మ ఆరాధనతో ధర్మముల స్థాపన జరుగుతుందన్నారు. అదే త్రైత సిద్ధాంతం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. భగవద్గీతలోని పురుషోత్తమ ప్రాప్తి యోగ అధ్యాయంలో 16, 17 శ్లోకాలు త్రైత సిద్ధాంతానికి ఆధారమన్నారు. త్రైత సిద్ధాంత భగవద్గీత జ్ఞానం ద్వారా సమాజంలో ఉన్న కుల మతాలను రూపుమాపడానికి, ప్రజల మధ్య అసమానతలను తొలగించడానికి దోహదం చేస్తుందన్నారు. సభ్యులు సురేష్, వీరయ్య, మద్దిలేటి, మల్లేసు, ఉదయ్‌కుమార్, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

మొహర్రం వేడుకలు ప్రారంభం



బత్తలపల్లి కాశీంస్వామిని భక్తులకు చూపుతున్న దృశ్యం



గతేడాది మొహర్రం ఉత్సవాల్లో బత్తలపల్లిలో భేటీకి తరలివచ్చిన వివిధ గ్రామాల పీర్లు(ఫైల్)

- గుండం తీసి వేడుకలకు అంకురార్పణ
- సందడిగా పీర్లచావిడి పరిసరాలు

బత్తలపల్లి: మండల కేంద్రంలో ఖాసీంస్వామి(మొహర్రం) ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. గ్రామపెద్దల సమక్షంలో పీర్లను భద్రపరిచే పెట్టెను కిందకు దించి ముజావర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం గుండం తీసి వేడుకలకు అంకురార్పణ చేశారు. ఈ వేడుకలు పది రోజులు పాటు వైభవంగా జరుగుతాయి. జిల్లాలో గూగూడు తర్వాత అంతటి స్థాయిలో బత్తలపల్లిలో మొహర్రం వేడుకలను జరుపుకుంటారు. మండలంలోని పలు గ్రామాల్లో ఈ వేడుకలను నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నారు. మొహర్రం వేడుకలు ప్రారంభంకావడంతో చిన్నారుల్లో ఆనందానికి అవధులు లేవు. ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని తహసీల్దార్ శివశంకర్‌నాయక్, ఎస్‌ఐ పి.శ్రీనివాసులు గ్రామ పెద్దలకు సూచించారు.

ఉత్సవాలు ఇలా..

రెండవ గూగూడుగా అభివర్ణించే బత్తలపల్లి ఖాసీం స్వామి (మొహరం) ఉత్సవాలు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. పది రోజులపాటు జరిగే వివిధ కార్యక్రమాల వివరాలను ముజావర్లు(పూజారులు) ఆదివారం వివరించారు. తొలిరోజు అంకురార్పణ, 8వ తేదీ రాత్రికి పీర్లను అలంకరించి వేదికమీద ఆశీనులు చేస్తారు. ఆ రోజు నుంచి 11వ తేదీ వరకు నిత్యపూజ నివేదన, 12వ తేదీ ఐదో సరిగెత్తు, అదే రోజు ముస్లింలు పక్కీర్లవుతారు. 13వ తేదీ నిత్యపూజ నివేదన, 14వ తేదీ చిన్నసరిగెత్తు(పానకాలు) నిర్వహిస్తారు. అదే రోజు రాత్రికి హిందువులు, పక్కీరుబాబాలుగా దీక్ష చేపడతారు. 15వ తేదీ ఉదయం గ్రామోత్సవం అనంతరం పీర్లు గంటాపురం, వేల్పుమడుగు, పోట్లమర్రి గ్రామాలకు వెళ్లి ఆ గ్రామాల్లో నిలిపిన పీర్ల చావిడి వద్ద పీర్లు పూజలందుకుంటాయి. ఈ విధంగా పీర్లు అన్ని గ్రామాలను సందర్శించి అక్కడిపీర్లను జలది రోజు భేటీలకు రమ్మని ఆహ్వానించినట్లుగా అందరూ భావిస్తారు. 16వ తేదీ పెద్ద సరిగెత్తు (పెద్దపానకాలు) అత్యంత వేడుకతో నిర్వహిస్తారు. ఆ రోజు పీర్లను వివిధ రకాలుగా అలంకరించి మొక్కుబడులను చెల్లిస్తారు. అదే రాత్రంతా అగ్నిగుండం పెద్ద ఎత్తున రగిలించి అలావ్ (కదం) తొక్కుతారు. ఈ దశ్యం చూడముచ్చటగా ఉంటుంది. 17వ తేదీ ఉదయం పీర్లు గ్రామోత్సవం, జలధి నిర్వహిస్తారు. 19న జార్తల్(దినాలు) చేస్తారు.

తొలి దర్శనంతో పులకించిన భక్తులు

బత్తలపల్లి ఖాశీంస్వామి ప్రథమ దర్శనం ఆదివారం రాత్రి కల్పించారు. ఆదివారం రాత్రి ఖాశీంస్వామి ఉత్సవాలను ప్రారంభించారు. ముజావర్లు మహబూబ్‌బాషా, జిలానీ, నజరుల్లా ఫాతెహా నిర్వహించారు. అనంతరం ముజావర్లు కాశీంస్వామిని భక్తులకు చూపించారు. బత్తలపల్లి సీఐ ఆరోహణరావు, ఎస్‌ఐ శ్రీనివాసులు సిబ్బందితో గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అండగా ఉంటా



కొత్తకోటలో ఇటీవల టీడీపీ నేతలు ధ్వంసం చేసి పూడ్చి వేసిన బోరు బావిని పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

- ఏ ఒక్కరూ అధైర్యపడొద్దు
- మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట భరోసా

పుట్టపర్తి: నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అండగా ఉంటానని, ఏ ఒక్కరూ అధైర్యపడొద్దని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి భరోసా ఇచ్చారు. బుక్కపట్నం మండలం కొత్తకోట, బిట్రగుంటపల్లి గ్రామాల్లో టీడీపీ వర్గీయులు ఇటీవల వైఎస్సార్‌సీపీ వర్గీయులకు సంబంధించిన డ్రిప్ పైపులు, బోరు బావిని ధ్వంసం చేయడమే కాకుండా మామిడి చెట్లు నరికివేశారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆదివారం ఆయా గ్రామాలకు వెళ్లి బాధితులను పరామర్శించారు. అండగా ఉంటానని, పార్టీ శ్రేణులను కంటికి రెప్పలా కాపాడుకుంటానని భరోసా ఇచ్చారు. కొత్తకోటకు చెందిన ఆంజనేయులు కుటుంబ సభ్యులను పరామర్శించి.. టీడీపీ నాయకులు ధ్వంసం చేసి పూడ్చి వేసిన బోరు బావిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం బిట్రగుంటపల్లిలో పర్యటించారు. గ్రామంలో టీడీపీ నేతలు ధ్వంసం చేసిన భాస్కర్‌రెడ్డి, ఆదినారాయణకు చెందిన డ్రిప్, పీవీసీ పైపులను పరిశీలించి.. వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న గ్రామాలలో టీడీపీ నాయకులు విష సంస్కృతికి తెర లేపారన్నారు. రైతులని చూడకుండా పంట పొలాల్లోని బోర్లు, డ్రిప్ పరికరాలు, పీవీసీ పైపులను ధ్వంసం చేయటం తగదన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో బాధితుల తరపున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కొత్తకోట కేశప్ప, ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, పార్టీ నేతలు, కార్యకర్తలు ఉన్నారు.



బిట్రగుంటపల్లిలో టీడీపీ నేతలు ధ్వంసం చేసిన డ్రిప్, పీవీసీ పైపులను పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలను పర్యవేక్షిస్తున్న యువర్స్ ఫౌండేషన్ సభ్యులు, అతిథులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో ఆదివారం యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రముఖ పట్టుచీరల వ్యాపారవేత్త సందా రాఘవ, జింకా పురుషోత్తం హాజరయ్యారు. కడపలోని పుష్పగిరి కంటి ఆసుపత్రి వైద్యులు 95 మందికి కంటి పరీక్షలు చేయగా 58 మంది కంటి ఆపరేషన్లకు ఎంపికయ్యారు. వారందరికీ ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తామని యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు శీలా నాగేంద్ర, కార్యదర్శి జయరాం, కోశాధికారి బండి నాగేంద్ర తెలిపారు. యువర్స్ ఫౌండేషన్ సభ్యులు ఉపాధ్యక్షుడు సుకుమార్, సహాయ కార్యదర్శి నాగార్జున, పీఆర్‌టీ రాధాకృష్ణ, క్యాంపు ఛైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, సభ్యులు చాంద్‌బాషా, వైకే శ్రీనివాసులు, పోలా ప్రభాకర్, డాక్టర్ సుబ్బారావు, స్టార్ ఖలీల్, సత్రసాల మల్లికార్జున, రమేష్‌బాబు, లక్ష్మీనారాయణ, రామంజి, బండ్లపల్లి రంగనాథ్, ఏబికేకే రావు, రామచంద్రగుప్త, వెంకటేష్, రంగం ఆది, ఆదిశేషు, ఊకా సతీష్, మామిళ్ల ప్రసాద్, జయంతి వినోద్, నామాల శ్రీనివాసులు, వాసుదేవుడు, శివప్రసాద్, ఆప్తమాలజీ టెక్నీషియన్ నాగరాజాచారి, కోఆర్డినేటర్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ధర్మవరం క్రీడాకారులు



రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికైన ధర్మవరం చెస్ క్రీడాకారులు

ధర్మవరం అర్బన్: రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ధర్మవరం క్రీడాకారులు ఎంపికయ్యారని బీఎస్‌కే చెస్ అకాడమీ శిక్షకుడే ఆదిరత్నకుమార్ తెలిపారు. ఆదివారం హిందూపురంలో స్పార్బన్ చెస్ అకాడమీలో శ్రీ సత్యసాయి జిల్లా అండర్-19 ఓపెన్ చెస్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఇందులో ధర్మవరం బీఎస్‌కే చెస్ అకాడమీ క్రీడాకారులు కేదార్‌నాథ్, హర్షచైతన్య, సహస్ర తమ సత్తా చాటి రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికైనట్లు ఆదిరత్నకుమార్ తెలిపారు. అండర్-19 విభాగంలో కేదార్‌నాథ్ 2వ స్థానం, హర్షచైతన్య 4వస్థానం, అండర్-19 బాలికల విభాగంలో సహస్ర 4వ స్థానంలో నిలిచారన్నారు. ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ ఈనెల 12,13,14 తేదీల్లో నంద్యాల జిల్లాలో నిర్వహించబోయే అండర్-19 ఓపెన్, అండర్-19 బాలికల చెస్ పోటీలలో వీరు పాల్గొంటారని తెలిపారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



ధర్మవరంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు అందిస్తున్న దృశ్యం



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్/ తాడిమర్రి/ తనకల్లు/అమడగూరు/ ఎన్‌పీకుంట/కదిరిటౌన్: ధర్మవరం, తాడిమర్రి, తనకల్లు, అమడగూరు, కదిరి పట్టణంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయా ప్రాంతాల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు ర్యాలీలు నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహాల వద్ద కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించారు. అలాగే మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ మాదిగల వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అలుపెరగని పోరాటం చేస్తున్నామన్నారు. పలుచోట్ల అన్నదానంతోపాటు నోటుపుస్తకాలు పంపిణీ చేశారు.

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదినారాయణ, మానుకింద ముత్యాలు ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో రామకృష్ణ, సురేష్, అశోక్, శంకర్, దామాజిపల్లి, న్యామద్దెల గ్రామాల సభ్యులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి



పోస్టర్లు విడుదల చేస్తున్న ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు

ధర్మవరం అర్బన్: ప్రభుత్వ నిబంధనలు పాటించని జీవనజ్యోతి పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని పీఎస్‌యూ, ఏఐఎస్‌బీ, పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని జీవనజ్యోతి పాఠశాల ముందు ఆదివారం పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర, ఏఐఎస్‌బీ జిల్లా కార్యదర్శి పోతలయ్య, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి నిరంజన్‌యాదవ్ పోస్టర్లను విడుదల చేశారు. ట్రస్ట్ పేరుతో అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలపై సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న హాస్టల్‌పై చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు సాయిరెడ్డి, మురళి, హర్ష తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ జయంతి



బత్తలపల్లి: దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను సోమవారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, ఉపాధ్యక్షుడు కోటి సురేష్, నాయకులు బిల్లే సూరీ, షరబ్ యోగానందా ఆచారీ తెలిపారు. ఆదివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ సోమవారం ఉదయం 9 గంటలకు బత్తలపల్లిలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటం ఏర్పాటు చేసి నివాళులర్పించనున్నట్లు తెలిపారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

గాండ్లపెంట: స్థానిక వైఎస్సార్ కూడలి వద్ద సోమవారం ఉదయం 9.30 గంటలకు దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి ఆదివారం తెలిపారు. మండలంలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు హాజరు కావాలని కోరారు.

పుట్టపర్తి: మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం వైఎస్సార్ జయంతి వేడుకలకు నిర్వహిస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. నల్లమాడ, బుక్కపట్నం మండల కేంద్రాల్లో మాజీ ఎమ్మెల్యే వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తారన్నారు. కార్యక్రమానికి పార్టీ శ్రేణులు తరలి రావాలని కోరారు.

అమడగూరు: స్థానిక బస్టాండులోని వైఎస్సార్ విగ్రహం ఎదుట సోమవారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. మండల వ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

తనకల్లు: మండల కేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద సోమవారం ఉదయం 9 గంటలకు వైఎస్సార్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

కదిరి టౌన్: పట్టణంలో సోమవారం ఉదయం వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా మున్సిపల్ ఆఫీసు వద్దకు వెళ్లి అక్కడ వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తామన్నారు. పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

9న చేపల చెరువు వేలం

తనకల్లు: మండలంలోని కొక్కంటి నారప్పనాయుని చెరువులో చేపలు పట్టుకోడానికి ఈ నెల 9న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు కార్యదర్శి బాబ్‌జాన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలంపాటలో పాల్గొనదలచిన వారు రూ.10 వేలు డిపాజిట్‌ను చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం గ్రామ సచివాలయంలో సంప్రదించాలని సూచించారు.

నేలకోటమ్మ శత జయంత్యుత్సవాలు



ముదిగుబ్బ: మర్తాడు గ్రామంలో నేలకోటమ్మ దేవత శత జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక పూలు, వెండి ఆభరణాలతో అలంకరించి విశేష పూజలు చేపట్టారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వేద పండితుల ఆధ్వర్యంలో వేద పారాయణం, కలశపూజలు, దీక్ష హోమాలు తదితర కార్యక్రమాలను నిర్వహించారు.

అనంత గంగమ్మకు బోనాలు

తలుపుల: రాజనాలవాండ్లపల్లి సమీపంలోని అనంత గంగమ్మకు గ్రామస్తులు ఆదివారం బోనాలు పట్టే కార్యక్రమం నిర్వహించారు. తొలుత గ్రామ దేవతలైన బొడ్రాతమ్మలకు శుద్ధచేసి పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. అనంతరం ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనాల గంపలు ఎత్తుకొని తప్పెట్లతో ఊరేగింపుగా అనంత గంగమ్మ ఆలయానికి చేరుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. అనంతరం జంతు బలులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి



మాజీ సీఎం వైఎస్ జగన్‌తో కోటి సురేష్

బత్తలపల్లి: మండలంలో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించినట్లు వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు కోటి సురేష్ తెలిపారు. ఆదివారం బత్తలపల్లిలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 5న తాడేపల్లిలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కలుసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా తాను ధర్మవరం నియోజకవర్గం బత్తలపల్లి మండలం నుంచి వచ్చినట్లు వివరించగా ఆయన మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డితో కలిసి బాగా పని చేయాలని సూచించారన్నారు. మండలంలో కొంత మంది పార్టీ వీడినప్పటికి మెజార్టీ తీసుకొచ్చినట్లు వివరించామన్నారు. ప్రజలకు అండగా ఉండి ప్రజా సమస్యలపై పోరాడాలని సూచించారన్నారు.

వైఎస్సార్ జయంతికి తరలిరండి

చెన్నేకొత్తపల్లి: దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్లు చెన్నేకొత్తపల్లి జెడ్పీటీసీ మైలారపు గోవిందరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తామన్నారు. అనంతరం కేక్ కట్ చేయడం జరుగుతుందని తెలిపారు. మండలంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సెరికల్చర్ ఉద్యోగుల సమావేశం



సమావేశమైన సెరికల్చర్ ఉద్యోగులు

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్‌ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం సెరికల్చర్ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం జరిగింది. సమావేశానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న సెరికల్చర్ ఉద్యోగులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టుపరిశ్రమ శాఖ క్షేత్ర స్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలు, రైతులకు అందుతున్న సేవలు, మల్బరీ సాగు చేస్తున్న రైతులు నష్టపోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. పట్టు పరిశ్రమ శాఖలోకి ఇతర విద్యార్హతలు ఉన్న వారు రాకుండా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్టీఎస్‌ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. స్మిత, సుబ్బరాయుడుతో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న విలేజ్ సెరికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రిటైర్డ్ హెచ్‌ఎంకు సన్మానం

ధర్మవరం రూరల్: రావులచెరువు ప్రాథమిక పాఠశాల పనిచేసి ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన ప్రధానోపాధ్యాయుడు గోపాల్‌ను ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఎంఈఓ గోపాల్ నాయక్ మాట్లాడుతూ 30 ఏళ్లగా ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దిన ఘనత గోపాల్‌కు దక్కుతుందన్నారు.

టీడీపీ కార్యకర్తపై మరో కార్యకర్త అనుచరుల దాడి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భూషణ

ధర్మవరం: టీడీపీ కార్యకర్తపై అదే పార్టీకి చెందిన మరో కార్యకర్త దాడి చేసిన ఘటన పట్టణంలోని 40వ వార్డులో ఆదివారం చోటు చేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలు..పట్టణంలోని 40వ వార్డుకు చెందిన టీడీపీ కార్యకర్త భూషణ సాయంత్రం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశానికి హాజరయ్యారు. సమావేశంలో భూషణకు అదేపార్టీకి చెందిన కార్యకర్త అశోక్‌కు మధ్య వార్డులో పలు అంశాలపై ఆధిపత్యం విషయంలో తీవ్ర వాగ్వాదం జరిగింది. దీన్ని మనసులో ఉంచుకున్న అశోక్ 40వ వార్డులో నివాసం ఉంటున్న భూషణ ఇంటి వద్దకు తన అనుచరులను పంపి రాళ్లు, కట్టెలతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన భూషణను స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ పార్టీలో తమ లాంటి సీనియర్ కార్యకర్తలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. బాధితుడు అశోక్ అనుచరుడు మల్లితో పాటు 10 మందిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.